# కామ్రేడ్ తుఫాయిల్ అబ్బాస్‌కు విప్లవ నివాళులు

---------------------------------------------

**పాకిస్థాన్** కమ్యూనిస్టుపార్టీ తొలితరం నాయకులలో ఒకరైన కామ్రేడ్ తుఫాయిల్ అబ్బాస్ (92 సం॥లు) దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 2019 ఆగస్టు 8న కరాచిలో మరణించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

1927 సం॥లో భారతదేశంలో లక్నోకు దగ్గరలో వున్న దేబర్ అనే ఓ చిన్న పట్టణంలో కా॥ అబ్బాస్ జన్మించాడు. దేశ విభజన తర్వాత వారి కుటుంబం కరాచి తరలివెళ్ళింది. పాకిస్తాన్ కమ్యూనిస్టుపార్టీ తొలితరం సభ్యులలో ఈయన ఒకరు. ఓరియంటల్ ఎయిర్‌వేస్ ఎంప్లాయీస్ యూనియన్‌ను కా॥ అబ్బాస్ 1950లో స్థాపించారు. పాలకులు ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించిన ప్రతి సందర్భంలోనూ కామ్రేడ్ అబ్బాస్ అనేకసార్లు జైలులో నిర్బంధించబడ్డారు. ఆయూబ్ ఖాన్ ప్రభుత్వ కాలంలో కా॥ హసన్ నాజర్‌ను అరెస్టుచేసి, ఆపై హత్యగావించిన సందర్భంలో కూడా కా॥ అబ్బాస్‌ను జైలులో నిర్బంధించారు.

కా॥ అబ్బాస్ కరాచి పట్టణ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా కృషిచేశారు. పార్టీలో విబేధాలు ఉత్పన్నమయిన తర్వాత ఆయన కమ్యూనిస్టుపార్టీని వీడి, చైనా కమ్యూనిస్టుపార్టీ విధానాల వైపు మొగ్గుచూపారు. మావోసేటుంగ్ మరణం తర్వాత చైనా, రష్యా పాలకులను రివిజనిస్టులుగా పేర్కొంటూ ఆయన ఖండించారు. పాకిస్థాన్ కార్మిక ఫ్రంట్‌కు ఆయన అధ్యక్షునిగా పనిచేశారు.

కామ్రేడ్ తుఫాయిల్ అబ్బాస్‌కు సిపిఐ(ఎం-ఎల్) జోహార్లు అర్పిస్తోంది. పాకిస్తాన్ కార్మిక ఫ్రంట్ కామ్రేడ్స్‌కు, ఆయన కుటుంబసభ్యులకు సిపిఐ(ఎం-ఎల్) తన ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది.

-----------------------------------------------------------------------------

# కామ్రేడ్ సంతోష్‌రాణాకు విప్లవజోహార్లు

-----------------------------------

**వయోవృద్ధులైన** విప్లవ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ సంతోష్ రాణా(76 సం॥) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ 2019 జూన్ 29న కోల్‌కతాలో కన్నుమూశారు. కామ్రేడ్ సంతోష్‌రాణా పశ్చిమబెంగాల్‌లోని గోపీవల్లభపూర్‌కు చెందినవారు. 1960లలో కోల్‌కతా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో పి.హెచ్.డి చేస్తున్న కాలంలో ఆయన విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. తాను జన్మించిన ప్రాంతంలోనే విప్లవోద్యమ కృషిలో ఆయన నిమగ్నమయ్యారు. అంకితభావంతో కూడిన తన కార్యాచరణద్వారా అనతికాలంలోనే కార్యకర్తగా అభివృద్ధిచెంది చారిత్రక దేబ్రా-గోపీవల్లభపూర్ ప్రాంత ఆదివాసీ రైతాంగ తిరుగుబాటుకు నాయకుడిగా ఎదిగారు. జైలుశిక్షననుభవించారు. గోపీవల్లభపూర్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కా॥సంతోష్‌రాణా జైలునుండే పోటీచేసి గెలుపొందారు. సిపిఐ(ఎం.ఎల్) పిసిసికి ఆయన దీర్ఘకాలం ప్రధానకార్యదర్శిగా వున్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన పలు ప్రజాఉద్యమాలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆనాటి జార్ఖండ్ ఉద్యమంలో ఒక ముఖ్యమైన పాత్రను ఆయన నిర్వహించారు. ఆయన మరణం విప్లవోద్యమానికి తీరనిలోటు. అమరులైన కామ్రేడ్ సంతోష్‌రాణాకు విప్లవజోహార్లు.

oooo